క్లుప్తంగా

నాలుగు ఎకరాల వరిగడ్డి దగ్ధం



మంగొల్లు(వత్సవాయి): నాలుగు ఎకరాల వరి గడ్డి వామి దగ్ధమైన ఘటన శుక్రవారం తెల్లవారుజామున వత్సవాయి మండలం మంగొల్లులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన దేవినేని వెంకటేశ్వర్లుకు చెందిన వరిగడ్డి వామి నుంచి మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు, విషయాన్ని ఆయనకు తెలియజేశారు. అయితే అప్పటికే గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. ఈఘటనలో రూ.32వేల వరకు ఆస్తినష్టం సంభవించిందని బాధిత కుటుంబసభ్యులు తెలిపారు.

చెక్కు అందజేత

పెంట్యాలవారిగూడెం(వత్సవాయి):ప్రభుత్వ సాయాన్ని లబ్ధిదారులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరాం ధనుంజయ తెలిపారు. గ్రామానికి చెందిన మండి వెంకటరత్నంనకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.2.69లక్షల విలువగల చెక్కును శుక్రవారం ఆయన లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంట్యాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ బహూకరణ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి శుక్రవారం గ్రామానికే చెందిన విష్ణు హార్డ్‌వేర్ అండ్ మర్చంట్స్ యజమాని మోహన్‌లాల్ వాటర్ కూలర్‌ను బహూకరించారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కిషోర్‌కుమార్, ఏఈ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

నందిగామరూరల్: ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వాసు కోరారు. మండలంలోని కంచల గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులకు జీలుగ విత్తనాలు, పాడి రైతులకు దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విత్తనాలు, దాణా కావాల్సిన రైతులు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి, నాయకులు రామిరెడ్డి సుబ్బారావు, మండదపు వెంకట్రావ్, పశువైద్యాధికారి సుష్మ, రైతులు పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ

నందిగామటౌన్:వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని ప్రజలు ఎండ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని హోమియో వైద్యుడు భానుప్రసాద్ సూచించారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద శుక్రవారం ఆయన ప్రజలకు వడదెబ్బ నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు కొబ్బరి నీరు, మజ్జిగ, పండ్ల రసాలను తీసుకోవాలని సూచించారు. చలివేంద్రం నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఉపాధి కూలీలు

నందిగామరూరల్:మండలంలోని కొణతమాత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మంద నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధి కూలీలు మొక్కలు నాటారు. గ్రామనాయకులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మొక్కలు నాటాలని కోరారు. గ్లోబల్ వార్మింగ్ వంటి ఉపద్రవాలను అరికట్టాలంటే మొక్కలు నాటడం ఒక్కటే పరిష్కార మార్గమని పేర్కొన్నారు. గ్రామ నాయకులు కేశగాని వెంకన్న, మన్నేపల్లి వినయ్, జవ్వాజి భాస్కరరావు, మందా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమీక్ష

వీరులపాడు:గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజు సూచించారు. జుజ్జూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మండలంలోని గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో మురుగునీటి పారుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు నీటి నిల్వలు లేకుండా చూడటంతోపాటు డ్రెయిన్‌లలో పూడిక తీత పనులు చేపట్టాలని తెలిపారు. విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.



పేరకలపాడులో పూర్తికాని రైతుభరోసా కేంద్రం భవనం



గండేపల్లిలో మధ్యలోనే ఆగిపోయిన జెడ్పీ పాఠశాల అదనపు తరగతి గదులు

ఏడాదిగా పూర్తికాని పనులు

- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం...
- గత ప్రభుత్వ పనులపై గుర్రు
- నిలిచిన ప్రభుత్వ భవనాల పనులు
- ఏడాదిగా ఇటుక పెట్టని వైనం
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా



కంచికచర్లలో అసంపూర్తిగా నిలిచిపోయిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్

కంచికచర్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఆయా ప్రభుత్వ భవన నిర్మాణ పనులను పూర్తిచేయడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన భవనాల పనులు మూడొంతులు పూర్తికాగా, మిగిలిన పనులను పూర్తిచేయడంలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో ప్రజాధనం వృథాగా మారింది. ఆయా ప్రభుత్వ భవనాల పనులు పూర్తిగాకపోవడంతో ప్రజలకు తగిన సేవలు అందకపోతుండటం గమనార్హం.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం..

2019–24 మధ్య అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనహయాంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు ప్రజలకు అన్నిరకాల సేవలు గ్రామస్థాయిలోనే అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతోపాటు నాడు–నేడు పథకం కింద పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాలకు సొంతభవనాల ఏర్పాటు తదితర పనులను భారీఎత్తున చేపట్టింది. అందులోభాగంగా నందిగామ నియోజకవర్గంలో కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు నాలుగు మండలాల్లో కలిపి 65 గ్రామసచివాలయాలు, 65రైతుభరోసా కేంద్రాలు, 48వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్లు మంజూరయ్యాయి. వీటిలో 47 సచివాలయాలు, 27ఆర్‌బీకేలు, 23 హెల్త్‌క్లినిక్ భవనాల పనులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూర్తిచేసింది. మొత్తం 104 అదనపు తరగతి గదుల పనులను పూర్తిచేసింది. మిగిలిన ఆయా ప్రభుత్వ భవనాల పనులు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయాయి. అనంతరం ఏర్పడిన కూటమి ప్రభుత్వం మిగిలిన ఆయా ప్రభుత్వ భవనాల పనులను పూర్తిచేయడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం ప్రజల పాలిట శాపంగా మారింది.



కంచికచర్లలోని అంగనవాడీ కేంద్రం భవనం పరిస్థితి ఇది

పనులు పూర్తిచేయాలని డిమాండ్..

కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు చేపట్టిన ఆయా భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ భవనాల పనులు పూర్తయితే పేదరోగులకు మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం ఉంది. మిగిలిన సచివాలయ భవనాల పనులు పూర్తిగాకపోవడంతో ఉద్యోగులు అరకొర వసతులతో ఉన్న పంచాయతీ కార్యాలయాలు, అద్దెభవనాల్లోనే విధులను నిర్వర్తిస్తూ ఇబ్బందిపడుతున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన ఆయా భవన నిర్మాణాలు కూడా అసంపూర్తిగా మిగిలిపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఆయా భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

సొంతభవనం లేక ఇబ్బంది..



మా గ్రామంలో సచివాలయానికి సొంత భవనం లేకపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. సగంలోనే నిలిచిపోయిన ఆయా భవన నిర్మాణ పనులను రాష్ట్రప్రభుత్వం వెంటనే పూర్తిచేయాలి.

– గడుపూడి సత్యనారాయణ, గండేపల్లి, కంచికచర్ల మండలం

ఆర్‌బీకేను పూర్తిచేయాలి..



సార్వత్రిక ఎన్నికల వరకు చకచకా సాగిన రైతుభరోసా కేంద్రం(ఆర్‌బీకే) భవన నిర్మాణ పనులు ఆతర్వాత పూర్తిగా నిలిచిపోయాయి. ఆర్‌బీకే భవనం పనులు పూర్తిచేసి ప్రజాధనం వృథా కాకుండా చూడాలి.

– వేమవరపు పురుషోత్తం సొసైటీ మాజీ అధ్యక్షుడు, పేరకలపాడు)

ఆదేశాలు రాగానే పనులు..

నియోజకవర్గంలో 18గ్రామ సచివాలయాలు, 38 ఆర్‌బీకేలు, 25 హెల్త్ క్లీనిక్ భవన నిర్మాణ పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తిచేస్తాం.

– శ్రీనివాసరావు పీఆర్ డీఈఈ, నందిగామ

ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు



డాక్టర్ అరుణకుమార్



డాక్టర్ జగన్‌మోహనరావు



తన్నీరు నాగేశ్వరరావు

నందిగామరూరల్/జగ్గయ్యపేటఅర్బన్: బక్రీద్ పండుగ సందర్భంగా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని ప్రజలకు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ కుమార్, మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, వైఎస్సార్ సీపీ పేట ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు శుక్రవారం శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, పక్కన అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనుగంచిప్రోలు: రోజూ యోగా, వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని ఐసీడీఎస్ పెనుగంచిప్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి సూచించారు. మండలంలోని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా కిశోరి బాలికలకు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా, వ్యాయామంతో రోగ నిరోధక శక్తి పెరగటంతోపాటు రక్తప్రసరణ సక్రమంగా జరిగి ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, విమల, జయలక్ష్మి,, నాగమణి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న బస్సు

ముగ్గురికి గాయాలు



లారీని ఢీకొన్న అనంతరం రోడ్డు పక్కకు దూసుకువెళ్లిన బస్సు

తోటచర్ల(పెనుగంచిప్రోలు): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడిన ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈక్రమంలో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన గోతిలో పడింది. ఈఘటనలో డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు బోల్తా పడి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదని ప్రయాణికులు ఆందోళన చెందారు. ఈ మేరకు పెనుగంచిప్రోలు ఎస్ఐ అర్జున్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి మిస్సింగ్

కంచికచర్ల: ఓ ఇంజినీరింగ్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన కంచికచర్లలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ బోనగిరి రాజు కథనం మేరకు కంచికచర్లకు చెందిన బండ్లమూడి నీహార్ స్థానిక మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. దురలవాట్లకు లోనైన నీహార్‌ను ఈనెల నాలుగోతేదీన తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన నీహార్ ఐదోతేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అతని కోసం పలుచోట్ల గాలించినా, ఆచూకీ తెలియకపోవడంతో శుక్రవారం కంచికచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి : సీఐటీయూ



డీఈవో సుబ్బారావుకు వినతిపత్రాన్ని అందిస్తున్న సీఐటీయూ నేతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్‌మెన్‌లకు పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు సిహెచ్ సుప్రజ, జిల్లా నేత ఎం.సోమేశ్వరరావు కోరారు. ఈ మేరకు వారు జిల్లా విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావును ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా స్కూల్ శానిటేషన్ వర్కర్స్‌ను యధావిధిగా కొనసాగించాలన్నారు. ప్రభుత్వం నిబంధనల పేరుతో ఆయాలను తొలగించడం సరైనది కాదన్నారు. ఇచ్చే అతి తక్కువ వేతనాలు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉండటం తగదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు జీతాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. 300మంది విద్యార్థులకు ఒక ఆయా నిబంధన కారణంగా వందలాది మంది ఆయాలు ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడాల్సిన పరిస్థితి తలెత్తుతోందన్నారు. ఈ నిబంధనలను ప్రభుత్వం వెంటనే తొలగించాలన్నారు. ఆయాలకు ఈఎస్ఐ, పిఎఫ్ వర్తింపచేయాలని, యూనిఫామ్, గుర్తింపుకార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ సమస్యల పరిష్కరించాలని కోరారు.

స్కానింగ్, టికెట్ పంచింగ్ పాయింట్లలో ఈవో తనిఖీలు



టికెట్ పంచింగ్ పాయింట్ వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఈవో శుక్రవారం ఆలయ ప్రాంగణంలోని స్కానింగ్, టికెట్ పంచింగ్ పాయింట్లలో తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. దీంతో ఉదయం 10–30 గంటల నుంచి అంతరాలయ దర్శనాలను రద్దు చేశారు. రూ.300 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు బంగారు వాకిలి దర్శనం కల్పించారు. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు రూ.300, రూ.100, సర్వ దర్శనం క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏఈవో చంద్రశేఖర్ రద్దీకి అనుగుణంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దర్శనాలు కల్పించారు. మరో వైపున ఈవో శీనానాయక్ గాలిగోపురం వద్ద ఉన్న స్కానింగ్ పాయింట్, ఆలయ ప్రాంగణంలోని టికెట్ పంచింగ్ పాయింట్‌లో భక్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులందరూ తప్పని సరిగా టికెట్ కొనుగోలు చేసేలా చూడాలని ఈవో ఆదేశించారు. అనంతరం రాజగోపురం వద్ద ఉచిత ప్రసాదాల పంపిణీని పరిశీలించారు. ఉచిత ప్రసాదాల వద్ద భక్తులకు తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే భవిష్యత్



మాట్లాడుతున్న విజయసారథి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థి స్థాయి నుంచే యువత తమలోని నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా అపారమైన ఉపాధి అవకాశాలతో పాటుగా ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చునని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి చెప్పారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో ల్యాబ్ ఆన్ వీల్స్ పేరుతో ఆన్‌లైన్ శిక్షణ తరగతులు శుక్రవారం జరిగాయి. తరగతుల ప్రారంభ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ ఇన్ఫోసిస్ సంస్థ వారు బస్సులో ఈ విధంగా సాంకేతిక పరిజ్ఞానంపై యువతకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. యువత తమలోని నైపుణ్యాలకు మరింతగా పదును పెట్టుకునేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఉపాధి కల్పన అధికారి వై.సత్యబ్రహ్మం మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతలో నైపుణ్యాలు చాలా అవసరమన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు.

జగన్మాతకు నృత్యార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం నందికొట్కూరుకు చెందిన శ్రీలిఖిత నృత్య కళాశాలకు చెందిన విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై డి.సాయి లిఖిత పర్యవేక్షణలో 9 మంది విద్యార్థులు పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించారు.

ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు



కంచికచర్లలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి, పక్కన విద్యార్థులు

కొణకంచి(పెనుగంచిప్రోలు):గ్రంథాలయాల్లో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులు ముగిశాయి. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ గోనెల దేవి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానభాండాగారాలు అని పేర్కొన్నారు. విద్యార్థులతోపాటు అందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెల రోజుల్లో విద్యార్థులు రోజూ గ్రంథపఠనంతోపాటు యోగా, ఆటలు, పాటలు నేర్చుకున్నారన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యాధికారి కె.వాణి, గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు, గ్రామపెద్దలు కెక్కర రామారావు, చిన్నం మార్కండేశ్వరరావు, ఎర్రం భాస్కరరావు, సామినేని కోటేశ్వరరావు, కాకుమాను వెంకటేశ్వరరావు, నార్ని వెంకటేశ్వరరావు, కన్నేటి అశ్విని, జగదీష్ పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల: వేసవి శిక్షణ తరగతుల నిర్వహణ, విద్యార్థుల భవిష్యత్‌కు చక్కటి పునాది వంటిదని ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు, శిక్షణనిచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు. ఇన్‌చార్జి గ్రంథపాలకుడు అల్లూరి రామచంద్రుడు మాట్లాడుతూ తరగతుల్లో భాగంగా విద్యార్థులచే పుస్తకపఠనం చేయించడంతోపాటు మ్యాథ్స్, ఇంగ్లిష్, డ్రాయింగ్, చెస్, యోగా తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణనిచ్చినట్లు వివరించారు. విద్యార్థులకు నిర్వహించిన ఆయా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్, డ్రాయింగ్, క్రాఫ్ట్ టీచర్లు నీలం సర్వేశ్వరరావు, ఎం.కనకారావు, బి. రాహుల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ దేవి

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేటఅర్బన్: ఆధునిక దేవాలయాలైన గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పదోవార్డు కౌన్సిలర్ రామలక్ష్మి సూచించారు. స్థానిక జిల్లా గ్రేడ్–1 స్థాయి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామలక్ష్మి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా విజ్ఞాన శిబిరానికి వచ్చి అనేక కొత్త విషయాలను నేర్చుకోవడం అభినందనీయమన్నారు. చిన్నారులకు శిక్షణనిచ్చిన ఉపాధ్యాయులు దోసపాటి నాగేశ్వరరావు, టి.వినోద్‌బాబు, టి.ప్రసాద్‌బాబు, బీడీసీ నాగమల్లికలకు అభినందనలు తెలియజేశారు. గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. వేసవి శిక్షణ శిబిరం ద్వారా చిన్నారులకు ఆయా అంశాల్లో ప్రత్యేక శిక్షణనిచ్చిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రమేష్, శ్యామల, సత్యవతి, రాము పాల్గొన్నారు.




పేటలో ఆయా పోటీల విజేతలతో కౌన్సిలర్ రామలక్ష్మి, ఆలేటి ప్రభ, ఉపాధ్యాయులు

దాడి చేసిన వారిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళను నోటికి వచ్చినట్లు దూషించడమే కాకుండా దాడికి పాల్పడిన వారిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. టేలర్‌పేట వీరయ్య వీధికి చెందిన జనమాల సునీతకు ఇద్దరు కుమారులు. సునీత భర్త రమేష్ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తూ కొంత కాలం కిందట మృతిచెందడంతో కారుణ్య నియామకం కింద అతని పెద్ద కుమారుడు నవీన్‌కుమార్‌కు ఉద్యోగం ఇచ్చారు. కొద్దికాలంగా నవీన్‌కుమార్‌కు, అతని భార్య చైతన్యకు గొడవలు జరుగుతుండడంతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో చైతన్య తల్లిదండ్రులు, బంధువులు గురువారం ఉదయం సునీత ఇంటికి వచ్చి నోటికి వచ్చినట్లు దూషించడమే కాకుండా దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చైతన్య తల్లి రత్నసులోచన, చిన్నమ్మ రవణతోపాటు మరి కొంతమందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధ్రువీకరణపత్రాలు అందజేత



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న బుద్ధ విహార్‌లో ధ్యాన చంద్ అకాడమీ వారి ఆధ్వర్యంలో కర్రసాము శిక్షణ పూర్తిచేసుకున్న సాధకులకు శుక్రవారం సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ ప్రాచీన భారతీయ యుద్ధ కళ అయిన కర్రసాము నేర్చుకున్న విద్యార్థులను అభినందించారు. కోచ్ మన్నెం నరేష్‌ను సత్కరించారు. బీజేపీ నాయకుడు అన్నెపాగ ప్రఫుల్లశ్రీకాంత్, అత్తులూరి వెంకటేశ్వరరావు, అత్తులూరి శ్రీనివాసరావు, రాజా పాల్గొన్నారు.

లారీ ఢీకొని గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కారుడ్రైవర్‌గా పనిచేసే గన్నవరం చింతకుంటకు చెందిన లక్ష్మణ్‌కుమార్ గురువారం బైక్‌పై జక్కంపూడి వెళ్తుండగా, వైవి.రావు రింగ్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన అతన్ని 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com